సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

ఆదివారం। 19। మే। 2024



సోమశిలలో 7.741 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శనివారం సాయంత్రానికి 7.741 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయం నుంచి 210 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.76,450
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,847
3 శాతం జీఎస్టీతో	రూ.7,052
సవర (8గ్రా)	రూ.56,416



స్ట్రాంగ్‌రూంల పరిశీలన

ప్రియదర్శిని కళాశాలలో ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూంలను కలెక్టర్ హరినారాయణన్, ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ శనివారం పరిశీలించారు. 8లో

న్యూస్‌రీల్

22న వీఎస్‌యూకు గవర్నర్ అబ్దుల్ నజీర్ రాక



అబ్దుల్ నజీర్

నెల్లూరు(దర్గామిట్ట): రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ఈ నెల 22న జిల్లా పర్యటనకు విచ్చేయనున్నట్లు కలెక్టర్ ఎం హరి నారాయణన్ శనివారం తెలిపారు. వెంకటాచలం మండలం కాకుటూరులోని విక్రమ సింహపురి యూనివర్సిటీ స్నాతకోత్సవ వేడుకలో ఆయన పాల్గొంటారు. 22వ తేదీ ఉదయం 9.45 గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి ఉదయం 10.40 గంటలకు నెల్లూరు పోలీస్ పరేడ్ మైదానానికి చేరుకుంటారు. 11.30 గంటల నుంచి విక్రమ సింహపురి యూనివర్సిటీలో నిర్వహించే స్నాతకోత్సవంలో పాల్గొంటారు. సాయంత్రం 5.35 గంటలకు పోలీస్ పరేడ్ మైదానం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి గన్నవరం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు.

గ్రంథాలయంలో వేసవి శిబిరం



వేసవి శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

నెల్లూరు(మినీబైపాస్): వేసవి విజ్ఞాన శిబిరం సందర్భంగా స్థానిక రంగనాయకుల పేటలోని శాఖా గ్రంథాలయంలో శనివారం విద్యార్థినీ విద్యార్థులకు పుస్తక పఠనాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మురిపూడి ట్రస్ట్ అధ్యక్షులు సతీష్ కుమార్ విచ్చేసి విద్యార్థులకు పేపర్ క్రాఫ్ట్‌లో భాగంగా టోపీలను చేయించారు. తదుపరి పిల్లలకు చాక్లెట్స్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని జూన్ 7వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు గ్రంథాలయ అధికారి వి.అరుణ పేర్కొన్నారు.

నీట మునిగిన యువకుడిని కాపాడిన మెరైన్ పోలీసులు



యువకుడిని ఒడ్డుకు చేర్చుతున్న మెరైన్ పోలీసులు

తోటపల్లిగూడూరు: కోడూరు బీచ్‌లో ప్రమాదంలో చిక్కుకున్న ఓ యువకుడిని మెరైన్ పోలీసులు కాపాడి ప్రాణాలు నిలబెట్టారు. వివరాల్లోకెళితే.. నెల్లూరు డైకాస్ రోడ్డుకు చెందిన జాని తన స్నేహితులతో కలిసి శనివారం ఉదయం కోడూరు బీచ్ సందర్శనకు వచ్చారు. మిత్రులందరూ బీచ్‌లో జలకాలాడుతుండగా జాని ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయాడు. విషయం తెలుసుకొన్న మెరైన్ పోలీసులు శేషగిరి, సంజయ్‌లు వెంటనే వచ్చి నీటిలో మునిగిపోతున్న అతనిని కాపాడి ఒడ్డుకు చేర్చారు. నీళ్లు తాగి ప్రాణాపాయ స్థితికి చేరిన జానిని నీళ్లు కక్కించి ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం నెల్లూరుకు తరలించారు.

పల్లెకు ఆరోగ్య ప్రదాయిని

వైద్యరంగానికి పెద్దపీట వేసిన ప్రభుత్వం

- విలేజ్ హెల్త్ క్లినిక్‌లో 12 రకాల వైద్య సేవలు
- 14 రకాల వైద్య పరీక్షలు
- 65 రకాల మందులు, టెలిమెడిసిన్ సేవలు
- మండలానికి రెండు పీహెచ్‌సీలు, ఒక్కో పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులు

గతంలో చిన్న జబ్బు చేస్తే పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రికి పరుగులు పెట్టాల్సి వచ్చేది. డాక్టర్ ఫీజుల నుంచి రక్తపరీక్షలు, మందులు అన్నీ కలిపి వేలాది రూపాయలు ఖర్చు చేసుకునేవారు. రోజువారీ కూలి మానుకుని ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సి వచ్చేది. మరీ పేదవర్గాలయితే నెలంతా కాయకష్టం చేసుకుని కూడబెట్టుకున్నది ఆసుపత్రి ఖర్చులపాలయ్యేది. కానీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదలకు అవసరమైన వైద్య ఆరోగ్య రంగానికి పెద్దపీట వేసింది. పల్లె ముంగిటకే వైద్యులు వచ్చేలా చేసింది.

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా వైద్య ఆరోగ్య రంగానికి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చారు. ఈ రంగాన్ని బలోపేతం చేసేందుకు రూ.వేల కోట్లు వ్యయం చేశారు. గ్రామీణ ప్రజలకు వారి సొంత ఊరులోనే ప్రాథమిక చికిత్సలు, పరీక్షలు అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రతి 2,500 జనాభాకు ఒక డాక్టర్ ఉండేలా వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీనివల్ల చిన్న చిన్న జబ్బులకు పీహెచ్‌సీలకు వెళ్లాల్సిన అవసరం ఉండదు. ఇందుకోసం బీఎస్సీ నర్సింగ్ కోర్సు అర్హత కలిగిన మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్స్ (ఎంహెచ్‌పీ)లను నియమించారు.



జేవీఆర్ కాలనీలోని హెల్త్ సెంటర్

జిల్లాలో మొత్తం 61 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీ) ఉన్నాయి. వాటిలో 122 మంది వైద్యులున్నారు. ఆయా పీహెచ్‌సీ వైద్యుల్లో ఒకరు పీహెచ్‌సీలో ఉంటే మరొకరు వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ను సందర్శిస్తారు. ఇలా ఒకరోజు ఒక వైద్యుడు విలేజ్ క్లినిక్‌కు వెళ్తే, మరుసటి రోజు మరో వైద్యుడు విలేజ్ క్లినిక్‌ను సందర్శిస్తున్నాడు. ఇలా ఒక్కో వైద్యుడు నెలలో 13 రోజుల పాటు విలేజ్‌హెల్త్ క్లినిక్‌లను సందర్శించడం జరుగుతుంది. 497 డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లుండగా అందులో ఎంహెచ్‌పీలు అందుబాటులో ఉన్నారు. ఈ క్లినిక్‌లలో 12రకాల వైద్య సేవలు అందిస్తున్నారు. 14రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. 67రకాల బేసిక్ ఎక్విప్‌మెంట్‌ను అందుబాటులో ఉంచారు. విలేజ్ క్లినిక్లన్నింటిలో ఏఎన్‌ఎంలు 24 గంటలు అందుబాటులో ఉంటారు. హెల్త్ అసిస్టెంట్‌తో పాటు ఆశా కార్యకర్తలు ఉంటున్నారు. ఈ క్లినిక్‌లను పీహెచ్‌సీలు, ల్యాబ్‌లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అనుసంధానం చేశారు. దీంతో టెలిమెడిసిన్ వైద్య సదుపాయం కల్పిస్తున్నారు.

నెలలో రెండుసార్లు సందర్శనం

డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ను పీహెచ్‌సీలోని వైద్యులు నెలలో రెండుసార్లు సందర్శిస్తున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విలేజ్ క్లినిక్‌లో ఉండి రోగులను పరీక్షించడం చేస్తున్నారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు క్లినిక్‌కు రాలేని వృద్ధులు, అనారోగ్య కారణంగా మంచంలోనే ఉంటున్న వారి ఇంటికే వెళ్లి సదరు వైద్యుడు వైద్య సేవలందిస్తున్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

నెలవారీగా 40 వేల ఓపీలు

జిల్లా వ్యాప్తంగా 497 విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో సగటున నెలవారీగా దాదాపు 40 వేలకు పైగా ఓపీలు నమోదవుతున్నాయి. అంటే రోజువారీగా 1350 ఓపీలకు సేవలు అందిస్తున్నారు. ఇలా గత పది నెలలుగా 4,03,545 ఓపీలు నమోదయినట్లు గణాంకాలు చెపుతున్నాయి. పదినెలల క్రితమే ఫ్యామిలీ డాక్టర్ సేవలు ప్రభుత్వం ప్రారంభించడంతో పల్లెల్లో విశేష స్పందన లభిస్తోంది. వైద్యులే పల్లెకు వచ్చి సేవలందించడంపై గ్రామీణ ప్రాంతాల్లో హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అర్ధరాత్రి రోడ్డు ప్రమాదం

- లారీని వెనుక నుంచి ఢీకొన్న కారు
- నలుగురికి తీవ్ర గాయాలు, ముగ్గురి పరిస్థితి విషమం
- క్షతగాత్రులంతా బాపట్ల జిల్లా వాసులు

కొడవలూరు: కొడవలూరు మండలం టపాతోపు వద్ద శుక్రవారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో జాతీయ రహదారిపై లారీని కారు ఢీకొన్న ప్రమాదంలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెంకు చెందిన 8 మంది మారుతి ఎర్టిగా కారులో బ్రహ్మంగారిమఠం, ఒంటిమిట్ట రామాలయాలను దర్శించుకుని తిరిగి స్వగ్రామానికి బయలుదేరారు. టపాతోపు క్రాస్‌రోడ్డు వద్ద ముందు వెళుతున్న లారీ హఠాత్తుగా స్లో చేయడంతో వెనుక వస్తున్న కారు వేగం అదుపు కాక లారీ వెనుక భాగాన ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న అట్ల ఏడుకొండలరెడ్డి, గుడివాడ దుర్గారావు, అన్నం కోదండరామిరెడ్డి, అసోది మల్లారెడ్డిలకు తీవ్ర గాయాలయ్యాయి. మల్లారెడ్డి పరిస్థితి కాస్త మెరుగ్గా ఉండగా, మిగిలిన ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండడంతో వెంటిలేటర్‌పై అత్యవసర చికిత్స అందిస్తున్నారు. కారులో ఉన్న మరో నలుగురు సురక్షితంగా బయటపడ్డారు. వీరంతా ఒకే గ్రామానికి చెందిన వారు కావడంతోపాటు బాగా పరిచయస్తులు కావడంతో ప్రత్యేక కారులో దైవ దర్శనానికి బయలు దేరినట్లు బాధితులు తెలిపారు.



లారీని ఢీకొన్న కారు

మానవత్వం చాటుకొన్న వైద్య విద్యార్థినులు

ప్రమాదం జరిగిన సమయంలో జాతీయ రహదారిపై కారులో వెళుతున్న వైద్య విద్యార్థినులు కొందరు తమ వాహనాన్ని ఆపి బాధితులకు ప్రాథమిక చికిత్స చేసి మానవత్వం చాటుకొన్నారు. సంఘటనా స్థలికి చేరుకొని కారులో ఉన్న ప్రమాద బాధితులను స్థానికుల సాయంతో వెలికి తీయడంతోపాటు వారందరికీ ప్రాథమిక చికిత్స అందించారు. 108 వాహనానికి సమాచారం ఇచ్చి వారందర్నీ అందులోకి తరలించడంలో ఎంతో చొరవ చూపారు. వైద్య విద్యార్థినుల చొరవను అందరూ ప్రశంసించారు. ఎస్సై కె.వీరప్రతాప్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాద స్థలిలో క్షతగాత్రుల సేవలో వైద్య విద్యార్థినులు



ఏడీఏలతో సమావేశం నిర్వహిస్తున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి సత్యవాణి

ఖరీఫ్‌కు విత్తనాలు సిద్ధం

- రైతు భరోసా కేంద్రాల ద్వారా పంపిణీ
- వ్యవసాయశాఖ అధికారిణి సత్యవాణి

నెల్లూరు(బారకాసు): జిల్లాలో రానున్న ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వివిధ రకాల విత్తనాలను స్థానికంగా రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అందుబాటులో ఉంచినట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి సత్యవాణి పేర్కొన్నారు. నెల్లూరులోని వ్యవసాయశాఖ కార్యాలయంలో సబ్‌డివిజన్ ఏడీఏలతో శనివారం ఖరీఫ్ సన్నద్ధంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాకు జీలుగ 4,501 క్వింటాళ్లు, జనుము 2,135 క్వింటాళ్లు, పిల్లిపెసర 2,092 క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. గరిష్టంగా ఐదు ఎకరాల వరకు విత్తనాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రధానంగా బోర్ల కింద సాగు చేసుకునే రైతులకు మేలు రకం వరి విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. కిలోకి రూ.5 చొప్పున సబ్సిడీ ఇస్తామన్నారు. మినుము, పెసర, కందులకు 50 శాతం సబ్సిడీ ఇవ్వడం జరుగుతుందన్నారు. రైతులు గమనించి రైతు భరోసా కేంద్రాల వద్ద తీసుకోవచ్చని సూచించారు.

ఎక్కడ చూసినా ఎన్నికల చర్చే

- ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ
- లెక్కలతో కుస్తీపడుతున్న నాయకులు

కోవూరు: ఎన్నికల సమరం ముగిసింది. ఫలితాలు ఈవీఎంలలో నిక్షిప్తమయ్యాయి. గెలుపుపై ఎవరి అంచనాలు వారికి, ఎవరి ధీమాలు వారికి ఉన్నాయి. అయితే గ్రామాల్లో ఎన్నికల వేడిమాత్రం ఇంకా తగ్గలేదు. నలుగురు గుమిగూడిన చోట ఫలితాలు, మెజార్టీలపైనే జోరుగా చర్చ సాగుతోంది. ఏ ఓటర్లు ఏ పార్టీకి మొగ్గుచూపుతున్నారన్న రచ్చబండ చర్చలు కొనసాగుతున్నాయి. అంతే కాకుండా సామాజిక వర్గాల ప్రకారం ఎవరు, ఏ పార్టీ వైపు మొగ్గు చూపారన్న చర్చ కూడా నడుస్తోంది. పోల్ మేనేజ్‌మెంట్ ప్రభావం ఎంత, తమకు అనుకూలంగా ఉన్న అంశాలేంటి, గెలుపు ఏ విధంగా ఉండబోతోంది, ప్రత్యర్థికి బలహీనంగా మారిన పరిస్థితులు, తద్వారా గ్రామాల వారీగా మెజార్టీ వచ్చేందుకు ఏ పార్టీకి అవకాశం ఉందన్న లెక్కలు జోరుగానే వేస్తున్నారు. ఫంక్షన్లు, ఉత్సవాలు ఇలా సందర్భం ఏదైనా చర్చ మాత్రం ఎన్నికల ఫలితాల పైనే ఉంటోంది.



వివిధ అంశాలపై ఆరా

గ్రామాల వారీగా తమవైపు నిలబడే ఓటర్ల లెక్కలను గ్రామస్థాయి నాయకుల ద్వారా పోటీదారులు, వారి వర్గం వారు ఆరా తీస్తున్నారు. రాజకీయంగా చురుగ్గా ఉండే నాయకులకు స్థానికంగా లెక్కల మాట అటుంచితే, ఇతర ప్రాంతాల్లోని బంధువులు, స్నేహితుల నుంచి ఫోన్లు కూడా అధికంగా వస్తున్నాయి. తమ నియోజక వర్గాల్లో చర్చలకు తోడు కీలకంగా నిలిచే స్థానాల్లో ఫలితం ఏంటన్న అంశం కూడా ఈ చర్చల్లో ప్రధాన భూమిక పోషిస్తోంది. ఏది ఏమైనా ఫలితాలు వెలువడే వరకు ఈ చర్చలు కొనసాగుతూనే ఉంటాయన్నది ఒప్పుకోవాల్సిందే.

సోషల్ మీడియా గప్‌చుప్

సాధారణంగా ఎన్నికల సమయంలో ఓటర్లను ఆకర్షించడం కోసం వీధుల్లోని గోడలపై పోస్టర్లు అతికించే ఆనవాయితీ నుంచి డిజిటల్ వేదికల్లో వినూత్న పంథాలో ప్రచారం చేసేంత వరకు రూపాంతరం చెందింది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కొన్ని నెలలుగా జిల్లా అంతటా జోరుగా ప్రచారం సాగింది. 13వ తేదీతో ఎన్నికల ముగియడంతో ఒక్కసారిగా సోషల్ మీడియా మూగబోయింది. వాట్సాప్ మెసేజ్‌లు, అభ్యర్థుల బ్రాడ్ కాస్టింగ్ కాల్స్, రీల్స్‌తో దద్దరిల్లిన సోషల్ మీడియా ప్రచారం ఎన్నికలు ముగియగానే గప్‌చుప్ అయిపోయింది.

వేడుకగా బండాసుర వధ అలంకార ఉత్సవం

నెల్లూరు(బృందావనం): వైశాఖ మాసం పురస్కరించుకుని సంప్రదాయంగా నగరంలోని మూలాపేటలో శ్రీభువనేశ్వరి సమేత మూలస్థానేశ్వర స్వామివారి దేవస్థానంలో వసంతోత్సవాలు ఘనంగా భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. వసంతోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి బండాసుర వధ అలంకారోత్సవం వేడుకగా నిర్వహించారు. విశేషాలంకారంలో కొలువైన భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వర స్వామివారిని భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉభయకర్తలుగా కె.కృష్ణమ్మ, కుమారుడు కె.మాలకొండయ్య వ్యవహరించారు. కార్యక్రమాలను దేవస్థానం ఈఓ వేణుగోపాల్ పర్యవేక్షించారు.



బండాసుర వధ అలంకారోత్సవంలో స్వామివారు

పాత నేరస్తుడి అరెస్ట్

• రూ.14.24 లక్షల సొత్తు స్వాధీనం



నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

నెల్లూరు(క్రైమ్): దొంగతనానికి పాల్పడి తప్పించుకు తిరుగుతున్న పాతనేరస్తుడిని పోలీసులు నగరంలోని భగత్‌సింగ్‌కాలనీ సమీపంలో ఉన్న జాతీయ రహదారిపై అరెస్ట్ చేశారు. శనివారం బాలాజీనగర్ పోలీసుస్టేషన్‌లో నగర డీఎస్పీ డి.శ్రీనివాసరెడ్డి నిందితుడి వివరాలను వెల్లడించారు. నెల్లూరు నగరంలోని అరవిందానగర్ ఎక్స్‌టెన్షన్ ఏరియాల్లో శ్రీవల్లి కుటుంబం నివాసం ఉంటోంది. ఆమె ఈ నెల 15వ తేదీన తన కుటుంబంతో కలిసి అల్లూరులోని అత్త ఇంటికి వెళ్లారు. ఈ క్రమంలో గుర్తుతెలియని దుండగుడు ఇంటి తలుపులు పగులగొట్టి లోనికి ప్రవేశించాడు. బీరువాను పగులగొట్టి అందులో ఉన్న రూ.14.24 లక్షల విలువ చేసే 44.5 సవర్ల బంగారు ఆభరణాలను అపహరించుకుని వెళ్లాడు. ఈ నెల 16వ తేదీన ఇంటికి వచ్చిన శ్రీవల్లి, ఆమె కుటుంబ సభ్యులు చోరీ ఘటనపై బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానిక ఇన్‌స్పెక్టర్ ఎల్.వీరానాయక్ కేసు నమోదు చేశారు. ఘటనా స్థలంలో క్లూస్‌టీం వేలిముద్రలు సేకరించింది.

సాంకేతికత ఆధారంగా..

నగర డీఎస్పీ డి.శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్ తన సిబ్బందితో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఘటనా స్థలంతోపాటు, సీసీపుటేజీల్లో లభ్యమైన ఆధారాల మూలంగా నిందితుడు పాతనేరస్తుడైన బోడిగాడితోటకు చెందిన ప్రస్తుతం జనార్దనరెడ్డికాలనీలో నివాసం ఉంటున్న ఎం.సునీల్‌గా గుర్తించారు. అతని కోసం గాలింపు చర్యలు చేపట్టారు. సాంకేతికత ఆధారంగా శనివారం భగత్‌సింగ్‌కాలనీ సమీప జాతీయ రహదారిపై నిందితుడిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. అనంతరం తమదైన శైలిలో విచారించగా నిందితుడు నేరం చేసినట్లు అంగీకరించడంతో అతనిని అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి రూ.14.24 లక్షల విలువ చేసే 44.5 సవర్ల బంగారు ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

నిందితుడిపై డీసీ షీట్

సునీల్ చిన్నతనం నుంచే వ్యసనాలకు బానిసయ్యాడు. సులభ పద్ధతిలో డబ్బులు సంపాదించేందుకు దొంగతనాలను ఎంచుకున్నాడు. 2013 నుంచి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఇళ్లలో దొంగతనాలకు పాల్పడి పలుమార్లు పోలీసులకు చిక్కి జైలుకు వెళ్లి వచ్చాడు. అయినా అతని ప్రవర్తనలో మార్పురాలేదు. దీంతో నవాబుపేట పోలీసులు నిందితుడిపై డీసీ షీట్ తెరిచారు. చోరీ జరిగిన రోజుల వ్యవధిలోనే నిందితుడిని అరెస్ట్ చేసి చోరీసొత్తు రాబట్టేందుకు కృషి చేసిన స్థానిక ఇన్‌స్పెక్టర్ ఎల్.వీరానాయక్, ఏఎస్సై పి.శ్రీనివాసరాజు, హెచ్‌సీలు కె.వి.సుధాకర్, సీహెచ్ శివకుమార్, సీహెచ్ రమేష్, పి.వెంకటరావు, కానిస్టేబుల్స్ ఎం.శ్రీహరి, పి.తిరుపతి, పి.పార్థసారథి, ఓవీఎస్ శివప్రసాద్‌లను ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ అభినందించారని డీఎస్పీ తెలిపారు.

వైభవంగా కన్యకాపరమేశ్వరి నగరోత్సవం

నెల్లూరు(బృందావనం): నగరంలో శనివారం రాత్రి శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి నగరోత్సవం వైభవంగా జరిగింది. అమ్మవారి జన్మదిన వేడుకలను పురస్కరించుకుని స్టోన్‌హౌస్‌పేటలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారి నగరోత్సవం స్టోన్‌హౌస్‌పేటలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయం నుంచి బయలుదేరింది. అమ్మవారు ప్రత్యేక వాహనంలో ఏర్పాటు చేసిన వ్యాఘ్ర వాహనంపై కొలువుదీరి నవాబుపేట, శెట్టిగుంట రోడ్డు తదితర మార్గాల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. కార్యక్రమంలో నుడా చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్, ఆలయ పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.



నగరోత్సవంలో ఊరేగుతున్న వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారు

పొదలకూరు నిమ్మధరలు (కిలో)

పెద్దవి : రూ.80
సన్నవి : రూ.35
పండ్లు : రూ.25

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ :	రూ.172
లేయర్ :	రూ.110
బ్రాయిలర్ చికెన్:	రూ.300
స్కిన్‌లెస్ చికెన్:	రూ.330
లేయర్ చికెన్:	రూ.187

క్లుప్తంగా

దాడిపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): ఓ వ్యక్తిపై దాడి కేసులో చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. మూలాపేట కొండదిబ్బకు చెందిన గోవర్ధన్‌కు మూలాపేటకు చెందిన సునీల్‌కు ఆర్థిక విషయాల్లో విభేదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 17వ తేదీ రాత్రి మూలాపేటలోని వాగ్దా స్కూల్ వద్ద ఉండగా సునీల్, మరికొందరు తనపై దాడి చేశారని గోవర్ధన్ చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని..

• లారీడ్రైవర్ మృతి



సాంబశివరావు మృతదేహం

మనుబోలు: మండల పరిధిలోని జాతీయ రహదారిపై వీరంపల్లి క్రాస్‌రోడ్డు వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతిచెందాడు. గుంటూరు జిల్లాలోని దామరపల్లి గ్రామానికి చెందిన కొల్లిపర సాంబశివరావు(40) లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గుంటూరు నుంచి తిరుపతికి రైలు చక్రాల లోడుతో వెళుతున్నాడు. ఈ క్రమంలో వీరంపల్లి క్రాస్‌రోడ్డు వద్ద లారీని ఆపి ఇంజిన్ ఆయిల్ నింపుతున్నాడు. అదే సమయంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో సాంబశివరావు అక్కడికక్కడే మృతిచెందాడు. మనుబోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు దాటుతుండగా..

• గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

వెంకటాచలం: రోడ్డు దాటుతున్న వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొనగా అక్కడికక్కడే మృతి చెందిన ఘటన వెంకటాచలం మండలంలోని కాకుటూరు వద్ద జాతీయ రహదారిపై శనివారం జరిగింది. కోవూరుకు చెందిన ఆంథోని(55) గత ఆరేళ్లుగా కాకుటూరుకు వచ్చి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం ఉదయం చెరువు వద్దకు వెళ్లి స్నానం చేసిన అనంతరం రోడ్డు దాటుతుండగా.. గూడూరు వైపు నుంచి నెల్లూరు వైపు వెళ్లే గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

కాలువలో జారిపడి వ్యక్తి మృతి



పెంచలయ్య మృతదేహం

సంగం: కాలువ వద్ద కాళ్లు కడుక్కుంటుండగా ప్రమాదవశాత్తు కాలువలో జారిపడి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన శనివారం చోటుచేసుకుంది. మండల కేంద్రం సంగంకు చెందిన పెంచలయ్య స్థానిక కనిగిరి రిజర్వాయర్ ప్రధాన కాలువ వద్ద కాళ్లు కడుక్కుంటుండగా ప్రమాదవశాత్తు కాలువలో జారిపడి మృతిచెందాడు. ఈ ఘటనపై స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై నాగార్జునరెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సాయంతో మృతదేహాన్ని బయటకు తీయించారు. వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పెంచలయ్యకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

స్ట్రాంగ్‌రూంలో పోస్టల్ బ్యాలెట్‌లు



సీల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ఎం.హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి పోస్టులో వచ్చిన పోస్టల్ బ్యాలెట్‌లను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూంలో ఉంచి సీల్ వేశారు. శనివారం పోస్టులో వచ్చిన పోస్టల్ బ్యాలెట్ కవర్లను పోస్టల్ సిబ్బంది కలెక్టరేట్‌లో కలెక్టర్ ఎం.హరినారాయణన్‌కు అందజేశారు. ఈ పోస్టల్ బ్యాలెట్‌లను ట్రంకుపెట్టెల్లో భద్రపరిచి సీలు వేశారు. అనంతరం స్ట్రాంగ్‌రూంలో బాక్సులను ఉంచి రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో స్ట్రాంగ్‌రూంకు తాళాలు వేసి సీలు వేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఆర్‌ఓ బాపిరెడ్డి, వైఎస్సార్‌సీపీ ప్రతినిధి సుబ్బరాయుడు, టీడీపీ ప్రతినిధి కృష్ణ చైతన్య పాల్గొన్నారు.

స్ట్రాంగ్‌రూం పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ



స్ట్రాంగ్‌రూం వద్ద పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

నెల్లూరు(దర్గామిట్ట): ఎన్నికల లెక్కింపు కేంద్రమైన నెల్లూరులోని ప్రియదర్శిని కళాశాలలో ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూంలను కలెక్టర్ హరినారాయణన్, ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ శనివారం పరిశీలించారు. స్ట్రాంగ్‌రూం భద్రతకు సంబంధించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మానిటరింగ్ సిస్టంను వారు పరిశీలించారు. వారి వెంట అధికారులు ఉన్నారు.

చంపుతామని బెదిరించి నగదు దోపిడీ

• నిందితుల అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): ఓ వ్యక్తిని కత్తితో చంపుతామని బెదిరించి అతని వద్దనున్న నగదు, సెల్‌ఫోన్ దోచుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు 24 గంటల్లో నిందితులను అరెస్ట్ చేసి దోపిడీ సొమ్మును స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల సమాచారం మేరకు.. పొదలకూరు రోడ్డు జీవీఆర్ కాలనీకి చెందిన ఎ.కార్తీక్ ఏసీ కూరగాయల మార్కెట్ వద్ద తోపుడు బండ్లపై పండ్లు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 16వ తేదీ రాత్రి ఆయన ఎస్2 థియేటర్‌లో సినిమాకు వెళ్లాడు. అర్ధరాత్రి సినిమా వదలడంతో బైక్‌పై ఇంటికి బయలుదేరాడు. బాబా సమోసా దుకాణం సమీపంలోకి వచ్చేసరికి ఆటో, స్కూటీపై నలుగురు వ్యక్తులు అతనిని అటకాయించారు. కత్తితో చంపుతామని బెదిరించి కార్తీక్ వద్దనున్న రూ.5 వేల నగదు, సెల్‌ఫోన్ దోచుకెళ్లారు. ఆటోనంబర్, స్కూటీ నంబర్‌ను గుర్తుపెట్టుకున్న బాధితుడు దోపిడీ ఘటనపై 17వ తేదీ చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇన్‌స్పెక్టర్ బి.అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు ఎస్సై సయ్యద్ లతీఫున్నీసా కేసు నమోదు చేశారు. ఆటో, బైక్ నంబర్లు, సీసీపుటేజీల ఆధారంగా నిందితులు కొండాయపాళెం నక్కలగుంటకు చెందిన అరుల్ రాజ్, గోవర్ధన్, ఫణీంద్ర, రొక్సన్‌గా గుర్తించి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో శనివారం నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి దోపిడీ సొమ్మును స్వాధీనం చేసుకున్నారు. నిందితులు మత్తు, మాదక ద్రవ్యాల వినియోగానికి బానిసై దోపిడీలకు పాల్పడుతున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

• పేలిన గ్యాస్ సిలిండర్



పూర్తిగా దగ్ధమైన పూరిల్లు

అల్లూరు: మండల పరిధిలోని పురిణి పంచాయతీ నలచెరువుకట్ట కాలనీలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధమైన ఘటన శనివారం వేకువజామున జరిగింది. బాధితుల వివరాల మేరకు నలచెరువుకట్టకు చెందిన గిరిజనులు నంబూరు సరోజనమ్మ – శేషయ్య దంపతులు పూరింటిలో నివాసం ఉంటున్నారు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా శనివారం వేకువజామున పూరింటిలో మంటలు వ్యాపించాయి. ఈ విషయాన్ని గమనించిన సరోజనమ్మ వెంటనే అప్రమత్తమై ఇంట్లోని కుటుంబసభ్యులతో బయటకు వచ్చేసింది. ఇరుగుపొరుగు వారిని పిలవగా.. వారు మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో పూరింట్లో ఉన్న గ్యాస్ సిలిండర్ పెద్ద శబ్దంతో పేలడంతో వారు పరుగులు తీశారు. ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. మంటలను ఆర్పడం కోసం అగ్నిమాపక వాహనానికి ఫోన్ చేసినప్పటికీ ఎలాంటి ప్రయోజనం లేకపోయింది. ఇంట్లోని వస్తువులు, దుస్తులు మొత్తం కాలిపోయి బాధిత కుటుంబం కట్టుబట్టలతో మిగిలింది. వీఆర్వో శ్రీనివాసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ నాయకుడు దాసరి పోలయ్య ఆ కుటుంబాన్ని పరామర్శించి తనవంతుగా రూ.2 వేల ఆర్థికసాయం అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలై..

• చికిత్స పొందుతూ యువకుడు మృతి

నెల్లూరు(క్రైమ్): రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ యువకుడు మృతిచెందాడు. నార్త్ ట్రాఫిక్ పోలీసుల వివరాల మేరకు.. ముత్తుకూరుకు చెందిన పి.రాజేష్, చెముడుగుంటకు చెందిన సురేష్ నగరంలోని రావూస్ కళాశాలలో డిగ్రీ చదువుతున్నారు. ఈ నెల 17వ తేదీన ఇద్దరూ పరీక్ష రాశారు. అనంతరం రాజేష్ స్నేహితుడిని ఇంటి వద్ద వదిలేందుకు బైక్‌పై జాతీయ రహదారి మీదుగా చెముడుగుంటకు బయలుదేరారు. రాజేష్ బైక్ నడుపుతుండగా సురేష్ వెనుక కూర్చున్నాడు. సర్వేపల్లి కాలువ వద్దకు వచ్చేసరికి రాజేష్ ముందు వెళుతున్న బైక్‌ను వేగంగా ఢీకొనడంతో అతనికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సహకారంతో సురేష్ స్నేహితుడిని మెడికవర్ హాస్పిటల్‌కు తరలించి అతని కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. కుటుంబసభ్యులు ఆస్పత్రికి చేరుకుని మెరుగైన వైద్యం కోసం నారాయణ ఆస్పత్రికి అక్కడి నుంచి జీజీహెచ్‌కు తరలించారు. జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ రాజేష్ శనివారం మృతి చెందాడు. మృతుని తండ్రి మల్లికార్జున ఫిర్యాదు మేరకు నార్త్ ట్రాఫిక్ ఎస్సై గీతారమ్మ కేసు దర్యాప్తు చేస్తున్నారు.